క్లుప్తంగా

నీట మునిగిన పంట పొలాలు



పిడుగురాళ్లరూరల్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల్లో పొలాలు ముంపునకు గురయ్యాయి. ఆదివారం కూడా వర్షం కురవటంతో చేలు నీటితో నిండిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి పంటలో పూత, పిందె రాలుతుందని, కంది పంట తెలుపు రంగులో మారుతోందని, మిరప ఉడకెత్తి పంట చేతికి వస్తుందో రాదో అని రైతులు ఆవేదన చెందుతున్నారు.

జానపాడు చేపల చెరువులో వ్యక్తి మృతదేహం

పిడుగురాళ్ల: మండలంలోని జానపాడు చేపల చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం జరిగింది. సీఐ శ్రీరాం వెంకట్రావు కథనం ప్రకారం.. మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన యానాల సుబ్బారావు మద్యానికి బానిసై తరచూ ఇంట్లో నుంచి వెళ్లి పోతాడని, ఈ నెల 12న ఇంట్లో నుంచి వెళ్లి పోగా కుటుంబ సభ్యులు బంధువుల ద్వారా సుబ్బారావు ఎక్కడ ఉన్నాడో తెలుసుకొని ఇంటికి తీసుకొని వచ్చారు. నాలుగు రోజుల క్రితం మళ్లీ సుబ్బారావు ఇంట్లో నుంచి వెళ్లిపోగా కుటుంబ సభ్యులు కూడా మళ్లీ తిరిగి వస్తాడని భావించారు. కానీ ఆదివారం తెల్లవారుజామున జానపాడు చేపల చేరువులో మృతదేహం లభ్యం కావటంతో అటుగా చూసిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి అనవాళ్ల ప్రకారం సుబ్బారావు(44) మృతదేహంగా గుర్తించారు. వెంటనే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వం పాఠశాల విద్యను బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా తెలిపారు. పల్నాడురోడ్డులోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పల్నాడు జిల్లా కార్యవర్గ సమావేశంలో చాంద్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీఓను రద్దు చేసి 3,4,5, తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి వెనక్కు తీసుకవచ్చి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఉపాధ్యాయులు తమ వృత్తికి పునరంకితంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్, మక్కెన శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సయ్యద్ కరిముల్లా, మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల అసోసియేషన్ ఏర్పాటు



వినుకొండ(నూజెండ్ల): బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల అసోసియేషన్ వినుకొండ విభాగాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఆవరణలో బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సర్కిల్ ప్రెసిడెంట్ కె.ఎస్. కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ పే కమిషన్ జాప్యానికి గల కారణాలు, భవిష్యత్ పెన్షన్ సవరణ కేంద్ర వేతన సంఘ సిఫార్సులను గురించి వివరించారు. సంఘం గుంటూరు జిల్లా సెక్రటరీ వై.బాబురావు, వినుకొండ బ్రాంచ్ సెక్రటరీ సీహెచ్. ఏడుకొండలు, నరసరావుపేట సెక్రటరీ నాగశంకర్, అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఏజీఎం రామిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రహిమాన్ పాల్గొన్నారు.

రేషన్ మాఫియాకు అడ్డుకట్ట

చిలకలూరిపేట: నియోజకవర్గంలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయడానికి జనసేన పనిచేస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్ చెప్పారు. నియోజకవర్గ పరిధిలో పలుమార్లు రేషన్ బియ్యం పట్టుబడిన నేపథ్యంలో జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ సుభాని, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మునీర్‌హసన్ పాల్గొన్నారు.

తుమ్మకోట.. సమస్యల వేట



సైడు కాల్వలు అస్తవ్యస్తంగా ఉండడంతో రహదారిపై పారుతున్న మురుగు



నివాసాల ముందు అధ్వానంగా ఉన్న పారిశుద్ధ్యం

- పారిశుద్ధ్యం అధ్వానం
- సైడ్ కాలువలు అస్తవ్యస్తం
- పట్టించుకోని అధికారులు

తుమ్మకోట(రెంటచింతల): తుమ్మకోట మొగల్ చక్రవర్తి ఔరంగజేబు (1648–1707) పాలించిన గ్రామం ఇది. ఆర్థిక పరిపుష్టి పుష్కలం. అయినా ఈ గ్రామంలో ఏ వీధి చూసినా పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటుంది. సైడ్ కాలువలు అస్తవ్యస్తంగా ఉంటాయి. గ్రామంలో ఎక్కడా అభివృద్ధి మచ్చుకైనా కానరావడం లేదు. మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీకి వచ్చే వివిధ ఆర్థిక సంఘాల నిధులు గ్రామాభివృద్ధికి ఖర్చుపెడితే ఈ దుస్థితి వచ్చేది కాదని గ్రామస్తులు చెబుతున్నారు. ఎస్సీ కాలనీలోని చర్చి సమీపంలో బురద రోడ్డు మురుగు కుంటను తలపిస్తోంది. దుర్వాసనతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. అధ్వానమైన పారుశుద్ధ్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో పూడిక పేరుకుపోయిందని చెబుతున్నారు. పూడిక తొలగించడం లేదని, ఫాగింగ్, బ్లీచింగ్ చల్లించకపోవడంతో దోమలు వ్యాప్తిచెంది విషజ్వరాల ప్రబలుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సత్వరమే స్పందించి గ్రామంలోని సమస్యలపై దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంతలు పూడ్చండి సారూ..!



జానపాడు–జూలకల్లు– కారెంపూడి రోడ్డు దారి పొడవునా గుంతలమయమైంది. ఈ దారిలో ప్రయాణమంటే నరకమే. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు మరింత ధ్వంసమైంది. ఆటోలు, కార్లు గుంతల్లో పడి మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికైనా ఈ దారిలో గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

– పిడుగురాళ్లరూరల్

ఓటరు నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



చిలకలూరిపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి కోరారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు 2025 మార్చిలో నిర్వహిస్తారన్నారు. గత ఎన్నికల ఓటరు జాబితా రద్దయిన కారణంగా తిరిగి అందరూ ఓట్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. 2021 నవంబర్ ఒకటి నాటికి డిగ్రీ పాసైన అందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. పాస్‌పోర్టు సైజు ఫొటో, డిగ్రీ పట్టా నకలు, ఆధార్‌కార్డు నకలు వివరాలతో ఓటరుగా ఆన్‌లైన్‌లో అప్లయి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.తిరుపతి స్వామి, నాయకులు జె.పార్ధసారధి, టి.సత్యనారాయణ, బిట్రా నాగేశ్వరరావు, ఎస్‌కెఎండీ యాసిన్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. తీరదు చింత

గోతులతో అధ్వానంగా ఉన్న పలు రహదారులు

రెంటచింతల: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులు కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతలమయమయ్యాయి. అడుగుకో గుంత ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక సెకను రెప్ప పడిందా.. గోవిందా అన్నట్టు పరిస్థితి తయారైందని ఆవేదన చెందుతున్నారు. వర్షాలకు పాలువాయి, గోలి, మల్లవరం, తుమ్మకోట, జెట్టిపాలెం, మంచికల్లు గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులు పెద్ద పెద్ద గుంతలుతో అధ్వానంగా మారాయి. రాత్రి సమయాలలో వాహనాలపై ఈ రహదారులపై వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.



పాలువాయి రోడ్డులో ఇదీ దుస్థితి

అప్రమత్తత.. పరిశుభ్రతే శ్రీరామరక్ష

- వర్షాలతో పశువుల్లో సీజనల్ వ్యాధులు
- పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి
- పశుశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి



పాడి గేదెలు



రొంపిచర్ల: ఇటీవల కురుస్తున్న వర్షాలతో చాలీచాలని పశువుల షెడ్‌లు, పాకల్లో ఉండే పశువులు సీజనల్‌గా వచ్చే వ్యాధుల బారిన పడుతున్నాయి. వర్షాలకు పశువుల్లో పలు రకాల వ్యాధులు ప్రభలుతున్నాయి. సీజనల్‌గా పశువులకు వచ్చే వ్యాధులను ముందుగానే గమనించటంలో పశుపోషకులు తగు జాగ్రత్తలు వహిస్తే వాటి నుంచి రక్షించుకోవచ్చు. వర్షాకాలంలో పశువుల్లో పాదుగు వాపు, జ్వరం, నోటిలో, కాళ్లపై పుండ్లు, గొంతు వాపు, శ్వాస సమస్యలు, దగ్గు, ముక్కులో నుంచి నీరు కారడం, చర్మంపై బొబ్బలు రావటం, వెంట్రుకలు రాలి పోయి పుండ్లు రావటం లాంటి జబ్బులు వస్తుంటాయి. అపరిశుభ్రంగా ఉన్న పశువుల శాలల్లో ఉండటం వల్ల ఎక్కువగా జబ్బుల బారిన పడుతుంటాయి. జబ్బు బారిన పడిన పశువుకు అవసరమైన వైద్యాన్ని కూడా అపరిశుభ్రమైన ప్రదేశం నుంచే అందించాల్సి వస్తుంది. పశుపాలకులు కనీస జాగ్రత్తలు తీసుకుంటే పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవటంతో పాటు పాల దిగుబడి కూడా తగ్గకుండా చూసుకోవచ్చు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- రైతులు తమ పశువులు సేదతీరే ప్రాంతంలో బురద, తేమ లేకుండా చూసుకోవాలి
- గాలి, వెలుతురు వచ్చేవిధంగా పశువులశాలను ఏర్పాటు చేయాలి
- పశువుల మల, మూత్ర విసర్జనను ఎప్పటికప్పుడు తొలగించాలి
- పశువులు పడుకునే ప్రాంతంలో బురదలేకుండా చూసుకోవటంతో పాటు పాలు ఇచ్చే పశువుల పొదుగుల దగ్గర బురద లేకుండా చూడాలి.
- ఎట్టి పరిస్థితుల్లోను గేదెలను వర్షంలో కట్టివేయకూడదు.
- పశువుల పాకల్లో, షెడ్‌లలో మేత వేసే గాడులను క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.
- తేమ ఉన్న ప్రాంతంలో, నీరు నిలబడే ప్రాంతంలో పశుగ్రాసాన్ని నిల్వ ఉంచితే కుళ్లిపోయే ప్రమాదం ఉంది. ఆ మేతను పశువులు తింటే కాలేయం కూడా దెబ్బ తింటుంది.
- పశువుల కాళ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. గిట్టల మధ్య పేరుకు పోయిన మట్టిని, వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలి.

దోమల పోటు అధికం..

వర్షాకాల సీజన్‌లో దోమ పోటు ఎక్కువగా ఉంటుంది. దోమ కాటు వల్ల పాడి పశువుల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. దోమల బారి నుండి పశువులను రక్షించుకునేందుకు దోమతెరలు ఉపయోగించటం శ్రేయస్కరం. పశువుల్లో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా తగు వైద్యం చేయించాలి. పశువుల పెంపకంలో కనీస జాగ్రత్తలు వహిస్తే సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షించుకోవచ్చు. పశువులపై వెచ్చించే పెట్టుబడి కూడా తగ్గుతుంది. పాల దిగుబడులు కూడా నిలకడగా ఉండటంతో పాటు పెంపకంలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా చూసుకోవచ్చు.

సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి



పశుపోషకులు పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులు రాకుండా ఉండేందుకు ముందుగా హెచ్ఎస్, ఎఫ్ఎండీ వంటి వ్యాక్సిన్‌లు వేయించాలి. పశువుల పాకాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వటంతో పాటు సాధ్యమైనంత వరకు పాడి గ్రాసాన్ని పశువులకు అందించాలి. పరిశుభ్రమైన నీరును పశువులకు తాగించాలి. రైతులు కనీస జాగ్రత్తలు పాటిస్తే వర్షాకాలంలో వచ్చే వ్యాధులను నుంచి పశు సంపదను రక్షించుకోవచ్చు.

– డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి, పశువైద్యాధికారి, కర్లకుంట

శంకర సత్సంగం పునరుద్ధరణ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని సన్నిధి వారి వీధిలో ఉన్న సన్నిధి వెంకట ఆంజనేయులు, నాసరమ్మ గార్ల ధ్యాన మందిరంలో ఆదివారం శ్రీ శంకర సత్సంగం పునరుద్ధరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా సిద్దేశ్వరం సమీపంలోని పునుగోడు గ్రామానికి చెందిన శుద్ధ చైతన్యానంద స్వామీజీ, శిష్య బృందం గురుపూజ చేశారు.
అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. శంకర సత్సంగం నిర్వాహకురాలు తెలగంశెట్టి పావనిదేవి మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా మేము ఇక్కడ సత్సంగం నిర్వహిస్తున్నా మని, ఇటీవల ఈ ధ్యాన మందిరం ఆధునికీకరణ చేసి ప్రారంభించినట్లు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

అనుపు కృష్ణా జలాశయంలోకి పదిలక్షల చేపపిల్లల విడుదల



అనుపు కృష్ణా జలాశయంలో చేపపిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

విజయపురిసౌత్/కారెంపూడి: మత్స్యకారుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి చెప్పారు. ఆదివారం మాచర్ల మండలం అనుపు కృష్ణా జలాశయంలో 10 లక్షల చేప పిల్లలను ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇప్పటికే నాగార్జున సాగర్, విజయపురిసౌత్ కాలనీలో మత్స్యకారులకు వాటర్ ప్లాంట్, రోడ్లు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల మనుగడ కోసం ఏటా చేప పిల్లలను కృష్ణా జలాశయంలో విడుదల చేస్తామని చెప్పారు. కొత్తగా మాచర్ల–సాగర్ డబుల్ లైన్ రహదారిని రూ.31 కోట్లతో నిర్మించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు, పంగులూరి పుల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, వీపీ సౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, నాయకులు డాక్టర్ ఎన్.బసివి రెడ్డి, ఆడెపు కోటయ్య, గంటా ధనుంజయరావు, తోటకూర పరమేశ్వరావు, సత్తిబాబు, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, జల్లెల కొండలు తదితరులు పాల్గొన్నారు.

– కారెంపూడి మండలం వేపకంపల్లి, పెదకొదమగుండ్ల, గాదెవారిపల్లె గ్రామాలలో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మూడు సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. అనంతరం కారెంపూడి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మొత్తం 18 మందికి రూ.41 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ పి సత్యప్రసాద్, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీఓ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు హెచ్చరించారు. రేపల్లె పట్టణ, రూరల్ సర్కిల్ ప్రాంతాలలోని రౌడీషీటర్లకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘ ఉంచామన్నారు. అల్లర్లకు పాల్పడినా, సెటిల్మెంట్లో పాల్గొన్నా.. కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పట్టణంలో ఎటువంటి అల్లర్లు జరిగినాదానికి సంబంధించిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిరంతరం రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచుతామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంబించాలని సూచించారు. ఆయన వెంట రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జున రావు, సిబ్బంది ఉన్నారు.

గేటు పడితే గోవిందా



జానపాడు రోడ్డులోని రైల్వే గేటు వద్ద ఆగిఉన్న వాహనాలు

జానపాడు రోడ్డులోని రైల్వే గేటు పడితే వాహనదారులకు నరకం కనపడుతోంది. చాలాసేపు పడిగాపులు పడాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరైనా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. వంతెన నిర్మాణం కోసం గతంలో ఇక్కడ ఆక్రమణలు తొలగింపజేశారు. తీరా ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. మళ్లీ గేటు పరిస్థితి మొదటికొచ్చింది. ఈ గేటు మీదుగా 30 రైళ్లు వరకు వెళ్తుంటాయి. అవి వెళ్లిన ప్రతిసారీ గేటు పడడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికై నా ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరతున్నారు.

– పిడుగురాళ్ల

ఇన్నర్‌వీల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మంజుల

చిలకలూరిపేట: పేదల ఆరోగ్య పరిరక్షణకు ఇన్నర్‌వీల్ క్లబ్ కృషి చేస్తుందని క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని తెలిపారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని మంజూ నర్సింగ్ హోమ్‌లో సన్ ఫార్మా లేబరేటరీ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా షుగర్, హెచ్‌బీఏ1సి, థైరాయిడ్, పాదాల న్యూరోపతి వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ మంజుల రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు తియ్యగూర రమాదేవి, పోతినేని పద్మావతి పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వైద్యశిబిరంలో 130మందికి పరీక్షలు

నరసరావుపేట: పట్టణ ఒడియరాజుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్స్ విజన్ కంటి వైద్యశాల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వడ్డెర సంఘం నాయకులు తిరుమలకొండ నరసింహారావు సారథ్యంలో వడ్డెర కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన శిబిరంలో డాక్టర్ చెంచిరెడ్డి పాల్గొని 130మందికి కంటి పరీక్షలు చేశారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. దేవల్ల వెంకటేశ్వరావు, కుంచాల కోటేశ్వరావు, కుంచాల శ్రీనివాసరావు, చల్లా శ్రీనివాసరావు, అచ్చి శివ కోటి, తన్నీరు శేఖర్ పాల్గొన్నారు.

అంతరవిశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక

నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, క్రీడాకారుడు దాలరాజు పృథ్వీసాయి మణికంఠ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 26 నుంచి 29వ తేదీవరకు తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఏఎన్‌యూ జట్టు తరఫున పాల్గొననున్నాడు. ఇటీవల జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి ఏడుగురు సభ్యుల జట్టులో స్థానం సాధించాడు. ప్రస్తుతం నరసరావుపేటలో డిగ్రీ విద్యాభ్యాసం చేస్తున్నాడు. తండ్రి సాంబశివరావు సాతులూరు హైస్కూలులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది జాతీయస్థాయిలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో రెండు మెడల్స్ సాధించి సత్తా చాటాడు. ఏఎన్‌యూ జట్టుకు ఎంపికైన పృథ్వీసాయి మణికంఠను హైస్కూలు హెచ్ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు అభినందించారు.